కలెక్టర్ వాహనాన్ని ఢీకొట్టాడు..

బంజారాహిల్స్, ఫిబ్రవరి 4: హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కారును అతివేగంగా వచ్చిన మరో కారు ఢీకొట్టింది. ఈ ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..బంజారాహిల్స్ రోడ్ నం.13లోని కలెక్టర్ బంగ్లానుంచి మంత్రుల నివాసం వైపు వెళ్తున్న హైదరాబాద్ కలెక్టర్ అధికారిక వాహనాన్ని రాంగ్‌రూట్‌లో వచ్చిన మినీ కూపర్ కారు (టీఎస్09జీవీ 7077) ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ మేరకు కలెక్టర్ వాహన డ్రైవర్ హేమంత్ కుమార్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఒడిశా నుంచి పూణేకు గంజాయి సరఫరా..

నిందితుడు అరెస్ట్.. 56.285 కిలోలు స్వాధీనం

మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 4: ఒడిశాలోని చత్రపూర్ నుంచి పూణే వరకు రైల్లో గంజాయిని తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా సభ్యుడిని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడి వద్ద నుంచి 14 లక్షల 17 వేల 125 రూపాయల విలువ చేసే 56.285 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం రైల్వే పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రైల్వే డీఎస్పీ జావెద్, రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్‌లు వివరాలను వెల్లడించారు. మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన మనోరంజన్ దాస్ ఆయా ప్రాంతాలకు కూలీల ద్వారా గంజాయిని తరలిస్తుంటాడు. అదే ప్రాంతానికి చెందిన వ్యవసాయ కార్మికుడు లక్ష్మణ్ శంభాజీ మొగల్ (36)ను గంజాయి సరఫరా చేస్తే ప్రతి ట్రిప్పుకు రూ.5వేలు ఇస్తానని చెప్పగా ఒప్పుకున్నాడు. లక్ష్మణ్ గంజాయి తీసుకొని కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో వస్తున్నాడు. ఈ నెల 3న రైలు ఉదయం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ 10వ నంబర్ ఫ్లాట్ ఫారంపైకి రాగా.. జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసు సిబ్బంది తనిఖీ చేస్తుండగా గంజాయి బయటపడింది. వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

చెరువుల్లో మట్టి పోస్తున్న టిప్పర్లు పట్టివేత

సిటీబ్యూరో, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): చెరువుల్లో మట్టి నింపుతున్న లారీలను పలుప్రాంతాల్లో హైడ్రా డీఆర్ఎఫ్ బృందాలు సోమవారం అర్ధరాత్రి పట్టుకున్నాయి. బండ్లగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉందాసాగర్ చెరువులో మట్టిపోస్తున్న 4 టిప్పర్లను హైడ్రా సిబ్బంది పట్టుకున్నారు. వీటితోపాటు చెరువులో మట్టిపోసి చదునుచేస్తున్న జేసీబీని కూడా పట్టుకున్నారు. ఈ వాహనాలను బండ్లగూడ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి బాధ్యులపై కేసులు పెట్టారు. పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవులపల్లి సమర్‌కుంట చెరువులో మట్టి పోస్తున్న టిప్పర్‌లారీని హైడ్రా డీఆర్ఎఫ్ బృందాలు పట్టుకున్నాయి. ఈ టిప్పర్‌ను పేట్‌బషీరాబాద్ పోలీసులకు అప్పగించి కేసు పెట్టారు.

అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న కారు..

బంజారాహిల్స్, ఫిబ్రవరి 4: బంజారాహిల్స్‌లో అర్ధరాత్రి వేగంగా వచ్చిన కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. బంజారాహిల్స్ రోడ్ నం.1లోని జీవీకే వైపునుంచి నాగార్జున సర్కిల్ వైపు వెళ్తున్న కారు (కేఏ 51ఎంటీ 0797) అదుపుతప్పి కుడివైపు ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. కారు డ్రైవర్ పారిపోగా, అందులో ఉన్న కేపీహెచ్‌బీ సమీపంలోని వసంత్‌నగర్ ప్రాంతానికి చెందిన పవన్ సాయిను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడికి బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించగా 226 బీఏసీగా తేలింది. కారు ముందు సీట్లో మద్యం బాటిళ్లు లభ్యం అయ్యాయి. తాను మద్యం సేవించినందున ఆన్‌లైన్‌లో డ్రైవర్‌ను బుక్ చేసుకున్నానని, యాక్సిడెంట్ చేసి పారిపోయాడని పవన్‌సాయి తెలిపారు. కాగా కారు నడిపిన వ్యక్తి ఎవరు అనేదానిపై పోలీసులు విచారణ చేపట్టారు.

చర్లపల్లి పారిశ్రామికవాడలో భారీ అగ్నిప్రమాదం

కెమికల్ కంపెనీలో చెలరేగిన మంటలు పక్క కంపెనీలకు వ్యాప్తి

8 ఫైర్ ఇంజన్లతో మంటలు అదుపులోకి..

ఘటనా స్థలాన్ని పరిశీలించిన రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు, అధికారులు

చర్లపల్లి పారిశ్రామికవాడలోని కెమికల్ కంపెనీలో ఎగిసిపడుతున్న మంటలు

ఘటన వివరాలు తెలుకుంటున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

చర్లపల్లి, కాప్రా,మల్లాపూర్, ఫిబ్రవరి 4 : చర్లపల్లి పారిశ్రామికవాడలోని ఓ కెమికల్ కంపెనీలో మంగళవారం సాయంత్రం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. పారిశ్రామికవాడలోని సర్వోదయ కెమికల్ కంపెనీలో నుంచి మంటలు ఉవ్వెత్తున ఎగిసిపడటంతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. హెచ్‌సీఎల్ సమీపంలోని ఈ కంపెనీలో చెలరేగిన మంటలు సమీపంలోని పలు కంపెనీలకు వ్యాపించాయి. మంటలు భారీగా ఎగిసిపడుతుండటంతో స్థానికులు భయాందోళన చెందారు. చర్లపల్లి, కుషాయిగూడ పోలీసులు, ఫైర్ ఇంజన్లు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చాయి.

పారిశ్రామికవాడలోని సర్వోదయ కెమికల్ కంపెనీలో మంగళవారం ఉదయం నుంచి పనిచేసిన 22 మంది కార్మికులు సాయంత్రం 5.30గంటలకు వెళ్లిపోయారు. సాయంత్రం 6.40 గంటలకు పరిశ్రమలోని సాల్వెంట్ల గదిలో మంటలు ప్రారంభమై క్రమ, క్రమంగా చెలరేగాయి. కెమికల్ పరిశ్రమకావడంతో పెద్ద ఎత్తున పేలుళ్లు, దట్టమైన పొగలు వ్యాపించాయి. సమీపంలోని ఫ్లోర షీల్డ్, మహాలక్ష్మి రబ్బర్ కంపెనీ, హరిత ఇండస్ట్రీస్ కంపెనీలకు మంటలు వ్యాపించాయి. కంపెనీ పూర్తిగా కాలిపోయింది. సమాచారం అందుకున్న మేడ్చల్ జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్, చర్లపల్లి ఫైర్ అధికారి రంజిత్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని 8 ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపు చేశారు. మంటలు చెలరేగిన సమయంలో కెమికల్ పరిశ్రమలో కార్మికులు లేకపోవడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. కుషాయిగూడ ఏసీపీ మహేశ్‌మార్‌గౌడ్, చర్లపల్లి సీఐ రవికుమార్ తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు కృషి చేశారు. సమీప ప్రాంతంలోని కంపెనీలకు మంటలు వ్యాపించడంతో ఆస్థి, ఇతరత్రా నష్టాల వివరాలు తెలియాల్సి ఉంది. రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు, ఐలా చైర్మన్ రోషిరెడ్డి, ఇతర ప్రతినిధులు ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

సకాలంలో స్పందించిన జలమండలి...

మంగళవారం సాయంత్రం చర్లపల్లిలోని ఎన్ఎఫ్‌సీ ఫేజ్-1లో అగ్నిప్రమాదం సంభవించిందని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్‌కి వచ్చిన సమాచారాన్ని జలమండలి ప్రధాన కార్యాలయానికి చేరవేసి, వాటర్ ట్యాంకర్ల కోసం సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించి జలమండలి జీఎంను అప్రమత్తం చేయడంతో మూడు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేశారు. ఘటనా స్థలంలో ఇద్దరు మేనేజర్లు, పోలీస్, ఫైర్ అధికారుల సమన్వయంతో మంటలను ఆర్పారు.

కారులో మంటలు..

పోచారం, ఫిబ్రవరి 4 : రోడ్డుపై వెళ్తున్న కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ సంఘటన పోచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. వర్ష్‌కారు (ఏపీ 09 బీజీ 6459) లో మంగళవారం శ్రావణ్, సంజీవ్, చంద్రకాంత్, సాయికిరణ్‌లు గచ్చిబౌలి సమీపంలోని దర్గా నుంచి కొమురవెల్లి దైవ దర్శనానికి బయలుదేరారు. ఉప్పల్ నుంచి పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడ ఫ్లైఓవర్ పైకి రాగానే ఒక్కసారిగా కారులో పొగలు వచ్చాయి. వెంటనే కారును పక్కకు ఆపి అందులో ఉన్నవారు కిందకు దిగారు. ఆ వెంటనే మంటలు చెలరేగాయి. కారు పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు పోచారం పోలీసులకు, అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించగా.. సీఐ రాజు, సిబ్బందితో వచ్చి పరిశీలించారు. ఎల్‌బీనగర్ నుంచి అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను ఆర్పివేసింది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం

మేడ్చల్, ఫిబ్రవరి 4 : మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీ కొన్న ఘటనలో ఒకరు, కంటైనర్‌ను ఢీ కొన్న ఘటనలో మరొకరు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఉషప్ప (40), ఆంజనేయులు, శ్రీనివాస్ భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తూ బోయిన్‌పల్లిలో నివాసం ఉంటున్నారు. మంగళవారం తెల్లవారుజామున ముగ్గురు ఒకే బైక్‌పై బోయిన్‌పల్లి నుంచి మేడ్చల్‌కు పనినిమిత్తం వస్తున్నారు. మేడ్చల్ పారిశ్రామికవాడ వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం వారిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఉషప్ప అక్కడికక్కడే మృతి చెందగా, ఆంజనేయులు, శ్రీనివాస్‌లకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న అందుకున్న పోలీసులు క్షతగాత్రులను స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తరలించి, మృతదేహాన్ని పోస్టుమార్టంనిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కంటైనర్‌ను ఢీకొని డాక్టర్ ..

మహబూబాబాద్‌కు చెందిన డాక్టర్ కిరణ్(28) కామారెడ్డిలో డాక్టర్‌గా పనిచేస్తున్నారు. మంగళవారం ఉదయం ఆయన నగరంలోని పద్మారావునగర్‌లో నివాసం ఉంటున్న స్నేహితుడిని కలిసేందుకు బుల్లెట్ వాహనంపై బయల్దేరాడు. 44వ నంబర్ జాతీయ రహదారిపై అతివేగంగా వస్తూ మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రేకులబావి ప్రాంతంలో ఉన్న తాజా హోటల్ వద్ద బైక్ అదుపుతప్పి ముందు వెళ్తున్న కంటైనర్‌ను ఢీ కొట్టాడు. ఈ ఘటనలో ఆయన కంటైనర్ కింద పడటంతో తలపై నుంచి చక్రాలు వెళ్లి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ముషీరాబాద్ హెబ్రోన్ చర్చి వివాదానికి తెర..

సొసైటీ, ట్రస్టు మధ్య సమస్యలకు కోర్టు పరిష్కారం

భక్తసింగ్ పేరును నిలబెట్టాలని ఇరువర్గాలకు సూచించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్

సొసైటీ, ట్రస్ట్ సభ్యులతో సమావేశమైన ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాజీవ్‌సాగ , తదితరులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 4(నమస్తే తెలంగాణ) : ముషీరాబాద్‌లో ఎంతో ప్రసిద్ధి గాంచిన హెబ్రోన్ చర్చి వివాదానికి తెర పడిం ది. సొసైటీ, ట్రస్ట్ మధ్య గత కొంతకాలంగా వివాదం కొనసాగుతూ వస్తుంది. ఈ క్రమం లో ఇరు వర్గాలు కోర్టు మెట్లెక్కడంతో సమస్యకు పరిష్కారం లభించినట్లుయింది. దీంతో హెబ్రోన్ చర్చి అడ్మినిస్ట్రేషన్, ఆరాధనకు సం బంధించి ఉన్న విషయాల్లో ఇరువర్గాల మధ్య కొనసాగుతున్న సమస్య తొలిగిపోయింది. ఈ నేపథ్యంలో మంగళవారం హెబ్రోన్ చర్చిలో క్రిస్టియన్ జేఏసీ చైర్మన్ సాల్మన్ రాజు, కృపా ధానం, సొసైటీ సభ్యులు బ్రదర్ కురియన్, పీటర్ చారితో పాటు ట్రస్ట్‌కు సంబంధించిన సభ్యులు ఎఫ్‌సీఎస్ పీటర్, కమిటీ సభ్యులతో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాజీవ్‌సాగర్, బీఆర్ఎస్ నాయకుడు ముఠా జయసింహాలు ప్రత్యేకంగా సమావేశమైయ్యారు. మరోసారి చర్చి, అడ్మినిస్ట్రేషన్‌ల విషయాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇరువురు కలిసిపోయి హెబ్రోన్ చర్చికి మంచి పేరు తేవాలని సూచించారు. సమాజంలో క్రైస్తవులకు మంచిపేరు ఉందని, ఆ పేరును నిలబెట్టుకునే విధంగా సమాజానికి మార్గదర్శకంగా ఉండాలని సూచించారు. ఈ సంఘా న్ని స్థాపించిన బ్రదర్ భక్తసింగ్ ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలని కోరారు. చర్చికి సంబంధించి ఇతరుల జోక్యం లేకుండా సొసైటీ, ట్రస్ట్ సభ్యులు కలిసిమెలిసి ఉండాలని ఎమ్మెల్యే చెప్పారు.

అవినాష్ కాలేజ్‌పై చర్యలు తీసుకోవాలి

దళిత విద్యార్థిని బహిష్కరించినందుకు నిరసనగా కాలేజ్ ఎదుట బీఆర్ఎస్వీ నాయకుల ధర్నా

సికింద్రాబాద్ అవినాష్ కాలేజీ ప్రధాన గేటు ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్వీ నేతలు

సికింద్రాబాద్, ఫిబ్రవరి 4: సికింద్రాబాద్ అవినాష్ కాలేజీ ఆగడాలు రోజు రోజుకు పెరుగుతున్నాయని, వెంటనే ఆ కాలేజీపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్వీ నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థులు గొడవపడ్డ కారణంగా డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతున్న రాహుల్ అనే దళిత విద్యార్థిని బహిష్కరించి, రోడ్డుపైకి నెట్టడాన్ని నిరసిస్తూ.. మంగళవారం కాలేజీ ప్రధాన గేట్ ముందు బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలేజీ నుంచి బహిష్కరింపబడిన దళిత విద్యార్థికి న్యాయం చేసి, అవినాష్ కళాశాల అనుమతులను రద్దు చేయాలని అన్నారు. బౌన్సర్లతో కళాశాలను నడిపించడం ఇదెక్కడి సంస్కృతి అని, నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేయడం దారుణమని అన్నారు. దళిత విద్యార్థినిని చీకటి గదిలోవేసి కొట్టి రోడ్డు మీద పడేసిన అవినాష్ కళాశాల చైర్మన్ అవినాష్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అవినాష్ కాలేజీపై చర్యలు తీసుకోవాలని లేనిచో తమ పోరాటం ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాటారు దశరథ్, రాష్ట్ర కార్యదర్శి జంగయ్య, హైదరాబాద్ అధ్యక్షుడు యాద క్రాంతి, చంద్రకాంత్, ఓయూ నాయకులు నాగేందర్ కోదాటి, అద్విత రెడ్డి, రాకేశ్, కల్లూరి సాయి, సంజు, నిజాం కళాశాల అధ్యక్షులు రాకేశ్, హేమ వర్ధన్, అభి ముదిరాజ్, శివ, రాజు, సిసిందర్ మనోజ్, వేణుమాధవ్, చింటూ, మహేశ్, ప్రశాంత్, వివేక్, తదితరులు పాల్గొన్నారు.

రుణం ఇప్పించి మోసం చేశారు..

బాధితుల ఆత్మహత్యాయత్నం.. నివారించిన పోలీసులు

బేగంపేట్ ఫిబ్రవరి 4: కూతురు వివాహం కోసం ప్రైవేట్ ఫైనాన్స్‌లో రుణం తీసుకున్న ఓ కుటుంబం.. రుణం ఇప్పించే సమయంలో దళారీలు చేసిన మోసానికి కుటుంబ సభ్యులు ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. ఈ సంఘటన బేగంపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ రామయ్య వివరాల ప్రకారం.. బేగంపేట్ ప్రకాశ్‌నగర్‌కు చెందిన బచ్చల అనసూయ, భరత్‌భూషన్ భార్యాభర్తలు. వీరు.. తమ కుమార్తె వివాహం నిమిత్తం లోన్ కోసం దళారులు భాను ప్రకాశ్, షఫీలను ఆశ్రయించారు. వీరు 2019లో విడతలవారీగా వారికి రూ.7 లక్షల లోన్ ఇప్పించారు. లోన్ తీసుకునే సమయంలో ఇంటి పేపర్లు మార్టిగేజ్ చేయాలని చెప్పగా దినాకర్, రజినీ పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేశారు. అప్పటి నుంచి అనసూయ, భూషన్‌లు నెలకు రూ. 15000 వేల చొప్పున కిస్తీలు కడుతూ వచ్చారు. కాగా.. దళారీలు ఈ ఇంటి పేపర్లు బ్యాంకులో తాకట్టు పెట్టి రూ.40లక్షల వరకు లోన్ తీసుకొని కిస్తీలు కట్టడం ఆపివేశారు. దీంతో లోన్ చెల్లించాలని బ్యాంక్ అధికారులు అనసూయ, భూషన్‌లకు నోటీసులు జారీ చేస్తూ వచ్చారు. మంగళవారం బ్యాంక్ అధికారులు ఇంటిని జప్తు చేసేందుకు వచ్చారు. వీరితో పాటు పోలీసులు, న్యాయవాదులు సైతం ఇంటికి వచ్చారు. అనసూయ, భూషన్‌లు వారిని అడ్డుకొని ఆయిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. పోలీసులు వారిని వారించి.. ఇరువర్గాల వారికి సంధి కుదిర్చారు. డబ్బులు చెల్లించేందుకు గడువు ఇప్పించడంతో ఘర్షణ సద్దుమనిగింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జీఆర్టీ జువెల్లర్స్‌లో కొత్త ఆఫర్

మీ పాత ఆభరణాలకు సరికొత్త రూపు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 4(నమస్తే తెలంగాణ): ప్రముఖ ఆభరణాల సంస్థ జీఆర్టీ జువెల్లర్స్ వినియోగదారుల కోసం సరికొత్త ఆఫర్‌ను ప్రకటించింది. పాత బంగారు ఆభరణాలకు ఆధునిక కళాత్మకతను జోడించి సరికొత్త ఆభరణాలుగా మార్చుకునే అవకాశం కల్పిస్తున్నదని జీఆర్టీ జువెల్లర్స్ ఎండి జీఆర్ ఆనంద్ అనంత పద్మనాభన్ తెలిపారు. విలువైన ఆభరణాలకు చక్కని మేళవింపులతో అందించడానికి ఒక ప్రత్యేక అవకాశంగా ఆయన అభిప్రాయపడ్డారు. ఈ అవకాశం కోసం మీ సమీప బ్రాంచ్‌ను సంప్రదించి పాత బంగారానికి కొత్త మెరుగులు దిద్దమని మేనేజింగ్ డైరెక్టర్ జీఆర్ రాధాకృష్ణన్ అన్నారు.



ఎత్నిక్, లెహంగా మేళా ప్రారంభం

కూకట్‌పల్లిలోని వైజంక్షన్ ది చెన్నై సిల్క్స్ ప్రాంగణంలో ఎత్నిక్, లెహంగా మేళా కస్టమర్లే ముఖ్యఅతిథులుగా ఘనంగా ప్రారంభమైంది. వెడ్డింగ్ లెహంగాలు, ఎత్నిక్ వేర్‌లలో వెరైటీలు, ఎక్కువ కలెక్షన్లతో పాటు బెస్ట్ క్వాలిటీ, బెస్ట్ డిజైన్స్ అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. పరిసర ప్రాంత ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏజీఎం మహేశ్, మేనేజర్లు త్యాగరాజన్, నాగేంద్ర, శ్రీనివాస్ కోరారు.

– సిటీబ్యూరో, ఫిబ్రవరి 4(నమస్తే తెలంగాణ)

సెక్రటేరియట్‌ను పేల్చేస్తామని ఫోన్..

నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

సిటీబ్యూరో/ఖైరతాబాద్, ఫిబ్రవరి 4(నమస్తే తెలంగాణ): తెలంగాణ సెక్రటేరియట్‌కు మూడురోజుల పాటు వరుసగా కాల్స్ చేసి బెదిరింపులకు దిగడం కలకలం రేపుతోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యాలయంలోని అర్జీలు, ఫిర్యాదుల విభాగానికి ఓ వ్యక్తి మూడురోజులుగా వరుసగా ఫోన్లు చేశాడు. ఉద్యోగులు, సిబ్బందిపై బెదిరింపులకు దిగాడు. సీఎంఓ కార్యాలయం ఫిర్యాదు మేరకు అలర్ట్ అయిన పోలీసులు మంగళవారం ఫోన్ చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. గత మూడురోజులుగా సెక్రటేరియట్ పేల్చేస్తానంటూ ఒక ఆగంతకుడు పోలీసులకు ఫోన్ చేస్తున్నాడు. ఆ ఆగంతకుడి కాల్స్ ట్రేస్ చేసిన పోలీసులు అతను లంగర్‌హౌజ్‌కు చెందిన మీర్ మహమూద్ హుస్సేని అలియాస్ సయ్యద్ ఇర్ఫాన్ అన్వర్‌గా గుర్తించారు. బెదిరింపు కాల్స్ చేసిన మీర్ మహమూద్‌ను ఎస్‌పీఎఫ్ పోలీసులు విచారించారు. సెక్రటేరియట్‌లో తన సమస్యను తీర్చడం లేదని అందుకే అధికారులపై కోపంతో అలా ఫోన్ చేశానని పోలీసులకు మీర్ మహమూద్ చెప్పాడు. లంగర్‌హౌజ్‌లోని హజరత్ సయ్యద్ షా మీరాన్ హుస్సేని రహమతుల్లా దర్గాకు సంబంధించిన ముతవలి నియామకం సమస్య గురించిన వివాదంపై అర్జీ పెట్టుకుంటే అధికారులు స్పందించలేదని మీర్ మహమూద్ చెప్పినట్లు పోలీసులు తెలిపారు. ఈక్రమంలో అతను పొంతనలేకుండా మాట్లాడుతూ మతిస్థిమితం లేనివాడుగా వ్యవహరించినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. అతనిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్న క్రమంలోనే పోలీసులకు, సెక్రటేరియట్ అధికారులతో మీర్ మహమూద్ వాగ్వాదానికి దిగాడు. మరోవైపు సచివాలయంలో బాంబు లేదని తేలడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే అసలు మీర్‌అలీ ఫోన్ చేయడానికి అతను చెబుతున్న కారణాలు సరైనవేనా.. లేక ఎవరైనా అతనితో ఫోన్ చేయించారా.. అనే కోణంలో సైఫాబాద్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సాక్షాత్తు సీఎం కార్యాలయానికే ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడడం, మూడురోజుల పాటు బయటకు పొక్కనీయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సెక్రటేరియట్‌లో భద్రతావైఫల్యంపై చర్చ జరుగుతోంది. ఇటీవల రెవెన్యూశాఖలో జూనియర్ అసిస్టెంట్‌నంటూ ఖమ్మం జిల్లాకు చెందిన భాస్కర్ అనే వ్యక్తి నకిలీ ఐడెంటిటి సృష్టించుకుని సెక్రటేరియట్‌లో హల్‌చల్ చేశారు. ఈ వ్యవహారంలో పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వరుస ఘటనలతో సచివాలయం భద్రతపై చర్చ జరుగుతోంది.



నిందితుడు మహ్మద్ మీర్ అలీ

పోలీసుల కస్టడికి గుర్రం విజయలక్ష్మి

దుండిగల్, ఫిబ్రవరి 4 : దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, మల్లంపేట్‌లో విల్లాల పేరిట మోసాలకు పాల్పడి రిమాండ్‌లో ఉన్న శ్రీలక్ష్మిశ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ యజమాని గుర్రం విజయలక్ష్మి(48)ని దుండిగల్ పోలీసులు మంగళవారం విచారించారు. గత నెల 30న విదేశాలకు పారిపోతూ శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ విమానాశ్రయంలో పోలీసులకు పట్టుబడింది. అదే రోజు పోలీసులు ఆమెను మేడ్చల్ కోర్టులో ప్రవేశపెట్టగా.. జడ్జి ఆమెకు 14రోజుల పాటు రిమాండ్‌ను విధించారు. అయితే దుండిగల్ పోలీసులు విచారణ నిమిత్తం ఐదురోజులు కస్టడి కోరగా.. కోర్టు ఒక్కరోజు మాత్రమే అనుమతించింది. దీంతో మంగళవారం మధ్యాహ్నం పోలీసులు రిమాండ్ ఖైదీగా ఉన్న గుర్రం విజయలక్ష్మిని దుండిగల్ పీఎస్‌కు తీసుకువచ్చి సుమారు రెండు గంటల పాటు విచారణ జరిపారు. విచారణలో విజయలక్ష్మి పోలీసులకు ఏ మాత్రం సహకరించనట్లు తెలుస్తోంది. తాను ఎటువంటి తప్పు చేయలేదని ఒకే ఒక్క సమాధానంతో సరిపెట్టినట్లు తెలుస్తుంది. కాగా మల్లంపేటలోని సర్వేనంబర్ 170/3,170/4,170/5లలో సుమారు 325 విల్లాలను నిర్మించింది. వీటిలో కేవలం సర్వేనంబర్ 170/3లోని 65విల్లాలకు మాత్రమే హెచ్‌ఎండీఏ నుంచి అనుమతులు పొందినట్లు సమాచారం. మిగతా విల్లాలను మాత్రం గ్రామపంచాయతీ నుంచి గ్రూప్ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ కింద అనుమతులు పొందింది. వీటిలో కొన్ని ఫేక్ అనుమతులు ఉన్నట్లు తెలుస్తుంది. ప్రభుత్వభూముల ఆక్రమణ, అక్రమంగా విల్లాల నిర్మాణం, విల్లాల పేరిట కష్టమర్ల నుంచి కోట్లాది రూపాయలు దండుకుని వారికి కనీస వసతులను కల్పించడంతో నిర్లక్ష్యం వహించడంతో వినియోగదారులు పలు మార్లు పోలీసులకు ఫిర్యాదు చేయగా పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన విషయం విదితమే. అదే సమయంలో సెప్టెంబర్ 8, 2024న పలువిల్లాలు కత్తాచెరువు ఎఫ్‌టీఎల్/బఫర్ జోన్‌లోకి వస్తున్నాయంటూ హైడ్రా 17విల్లాలను కూల్చివేసింది.

గుర్రం విజయలక్ష్మి

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

ఓం శివదుర్గా జ్యోతిష్యం

★వీరు శివదుర్గ దైవశక్తితో కేరళ సమాధి జపం సర్వమంత్ర సిద్ధి పొంది వున్నారు. అఘోర మరియు నాగసాధువులతో కలిసి సాధన పొంది వున్నారు. ఎటువంటి సమస్యలైనా 11 రోజులలో పరిష్కారం, శివం రోడ్. ఫోన్: 9866177085. NT-326945

OLD AGE HOME

★వృద్ధులు, NRI's విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి. దీర్ఘకాలిక మంచాన ఉన్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్, ఉప్పల్ & ECIL - కీసర రోడ్, చీర్యాల్ 'X' రోడ్, భోజన వసతితో. సంప్ర: 7981467036, 9391039990, 9949520296. NT-326937

★సుశీల్ ఫౌండేషన్ ఓల్డేజ్ హోం: ఇంటి వాతావరణం, శాకాహార భోజనం, వ్యక్తిగత శ్రద్ధ, డాక్టర్, నర్స్, ఆయా, అటెండర్ సౌకర్యం. మియాపూర్, Hyd. 9030008981. NT-339216

TOURS & TRAVELS

★మహాదేవ టూర్స్: శివ భక్తులందరికీ శివోహం శాస్త్రి ది బెస్ట్ ఆఫర్: కేదార్‌నాథ్, బదరీనాథ్‌తో కలిపి 10 జ్యోతిర్లింగాల యాత్ర 23 ఏప్రియల్ నుండి 21 రోజులు, 3Ac రైలు, Ac వాహనం, భోజన వసతులతో రూ. 55,000/- @ 9676637578. NT-329201

WATER PROOFING

★శ్రీ సాయి భవానీ వాటర్ ప్రూఫింగ్: సీలింగ్, సైడ్‌వాల్స్, టెర్రస్, సీలింగ్, వాటర్ ట్యాంక్, సంపు, బాత్‌రూమ్స్, ఎటువంటి లీకేజైనా 10 సంవత్సరాల వారంటీతో చేయబడును. 9948270898. NT-329018

BUSINESS OFFER

★మెడికల్, జనరల్ Items Supply చేసుకోవడానికి interested గల ఇన్వెస్ట్‌మెంట్ పార్టనర్ కావలెను. 8106734546.